పల్లెల్లో పండగ వాతావరణం

సంబేపల్లి : పల్లెల్లో సంక్రాంతి పండగ సందడి మొదలైంది. సెలవులు రావడంతో పట్టణాల నుంచి విద్యార్థులు, యువకులు, చిన్నారులు పల్లె బాట పట్టారు. ఈ క్రమంలోనే ఆయా గ్రామాల జనం టెంట్ వేసుకొని క్రికెట్, కబడ్డీ, గాలిపటాలు ఎగురవేయడం చేస్తారు. ఆడపడుచులు కొత్త అల్లుళ్ల వస్తుండడంతో పిండి వంటలు తయారు చేస్తారు.

రైల్వేకోడూరు అర్బన్ : సంక్రాంతి పండగను పురస్కరించుకొని పట్టణంలోని విజడమ్ విద్యా సంస్థల చైర్మెన్ టి.ప్రదీప్ విద్యార్థులకు ముగ్గుల పోటీలు శనివారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే భోగి, సంక్రాంతి, కనుమ పండగ జరిపించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషాలు ఆకట్టుకొన్నాయి. ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి: సంక్రాంతి పండగ సంతోషంగా జరుపుకోవాలని కోడి పందేలు, గ్యాంబ్లింగ్, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లి సీఐ వెంకటకొండార్డె అన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో స్పెషల్ పార్టీలు, రూట్ మొబైల్ పార్టీలు పనిచేస్తున్నాయన్నారు. కొంతమంది పర్మిషన్ తీసుకున్నామని చెప్పి మోసగించే ప్రయత్నం చేస్తారని, వారి మాటలు విని మోసపోవద్దని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలు వద్దు..

రామాపురం : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో కోడి పందాలు, జూదం, అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మండల సబ్ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు వెంకటసుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పలువురు పోలీసులు మఫ్టీలో తిరుగుతుంటారని, కోడి పందాలు, గ్యాంబింగ్, అసభ్యకర నృత్యాలు, అసాంఘీక కార్యక్రమాలు నిర్వహించిన చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.



విజడమ్ స్కూల్‌లో ముగ్గుల పోటీలు

కోడి పందేలపై కఠిన చర్యలు

చిట్వేలి : సంక్రాంతి సందర్భంగా కోడి పందేలపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రఘురాం హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ కోడిపందెం ఆడుతూ పట్టుబడితే కేసులు నమోదు చేయడంతోపాటు కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కోడిపందెం రాయుళ్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

రైతులకు మంచి జరగాలి

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని ప్రజలు, రైతులు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు నియోజకవర్గ ప్రజలకు శనివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంస్కృతికి నిదర్శనమైన పండగను రైతులు, ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.



మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

ఉపాధ్యాయులే.. సమాజానికి మూల స్తంభాలు

రాజంపేట : ఉపాధ్యాయులే.. సమాజానికి మూలస్తంభాలు అని అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ చొప్పాగంగిరెడ్డి అన్నారు. ఏయూ అనుబంధసంస్థ అన్నమాచార్య బీఈడీ కాలేజీలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బోధిస్తూనే, పదోన్నతి దిశగా విద్య అభ్యసించడం అభినందనీయం అన్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మెన్ చొప్పాఎల్లారెడ్డి మాట్లాడుతూ సమాజానికి నాణ్యమైన ఉపాధ్యాయులను అందించడంలో అన్నమాచార్య యూనవర్సిటీ ముందంజలో ఉంటుందన్నారు. అన్నమాచార్య బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ డా.జయరామిరెడ్డి మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అంబేడ్కర్ ఓపెన్ యూనవర్సిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులను నిర్వహించామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు బ్రోచర్లను అందజేశారు. చొప్పా అభిషేక్‌రెడ్డి, పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడికి బ్రోచర్ అందజేస్తున్న చొప్పా గంగిరెడ్డి

అందరి సహకారంతో ఉత్సవాలు

ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను అందరి సహకారంతో నిర్వహించగలిగామని అన్నమాచార్య యూనివర్సిటీ ఛాన్సలర్ చొప్పాగంగిరెడ్డి, ప్రో ఛాన్సలర్ చొప్పాఅభిషేక్‌రెడ్డి, ఏఐటీఎస్ వైస్ ఛైర్మెన్ చొప్పా ఎల్లారెడ్డి పేర్కొన్నారు.

సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలి

లక్కిరెడ్డిపల్లి : ప్రజలంతా సంక్రాంతిన ఆనందంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రమేష్‌రెడ్డి నివాసంలో అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, అంబాబత్తిన రెడ్డయ్య, తిమ్మరెడ్డి ఉమాపతిరెడ్డి కలిసి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి గజమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దప్పేపల్లి సిద్దారెడ్డి, సయ్యద్ అమీర్, వెంకట నారాయణ రెడ్డి, సిద్ధక నాగిరెడ్డి, రమణయ్య, జనార్దన్ రెడ్డి, గడ్డం కళ్యాణి ప్రబాకర్ రెడ్డి, దస్తగిరి, శంకర్ నాయుడు, జగన్ మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, భువనేశ్వర్ రెడ్డి, సుబ్బరాజు, దుర్గయ్య, రామ్మోహన్ శెట్టి, తదితరులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

త్యాగాలకు నిదర్శనం వడ్డె ఓబన్న



గరుగుపల్లెలో వడ్డె ఓబన్న చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న పల్లపు రమేష్, తదితరులు



రాయచోటిలో నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డెర ఓబన్న త్యాగాలకు నిదర్శనమని వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజంసుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి అన్నారు. పట్టణంలోని వడ్డె ఓబన్న కాంస్య విగ్రహానికి శనివారం వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివయ్య, తోటశివసాయి, సీహెచ్.రమేష్, రామకృష్ణ, హరికృష్ణ, బత్తల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాయచోటి: వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, అధికారులు ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, పెద్దయ్య, రాజారెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వడ్డెర సంఘం నాయకులు శనివారం పట్టణంలోని రామ్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. వడ్డెర సంఘం రాష్ట గౌరవాధ్యక్షుడు వడ్డె రమణ కేక్ కట్ చేశారు. పెంచలయ్య, బత్తుల శ్రీరాములు, జి.వీరభద్రయ్య, కృష్ణయ్య, పి.రామయ్య, వెంకటేష్, కోటకొండ హరి, రాజ, సహదేవ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

■ స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న నేటితరానికి ఆదర్శమని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్ పేర్కొన్నారు. స్థానిక గరుగుపల్లెలో వడ్డె ఓబన్న జయంతి శనివారం నిర్వహించారు. వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పల్లపురమణ, సుబ్బరాయుడు, బాలు, ఉపేంద్ర, కుంచపు ప్రసాద్, నాగరాజ పాల్గొన్నారు.

గాలివీడు: వడ్డెర సంఘం నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, జయరాములు గాలివీడులో శనివారం ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులులర్పించారు. వారు మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసినగొప్ప ధైర్యశాలి ఓబన్న అని పేర్కొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చిట్వేలి : పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. మండలంలోని పాల్లోపల్లి, చిల్లావాండ్లపల్లిలో నిర్మించిన మినీ గోకులం(పశువుల షెడ్)ను శనివారం ఆయన ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పశుసంవర్థక శాఖ అధికారులు, ఉపాధి హామీ అధికారుల సమన్వయంతో మినీగోకులాల నిర్మాణం పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముక్కా సాయివికాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు రాయితీపై మినీ గోకులాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించిందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. మండలంలోని రెడ్డివారిపల్లిలో మినీ గోకులాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు ప్రోత్సాహంగా మినీ గోకులాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని మూలపల్లిలో గోకులం షెడ్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి సౌకర్యం మెరుగు పరుస్తామని తెలిపారు. అనంతరం గువ్వలచెరువులో మృతి చెందిన జమృత్ కుమారుడు, టీడీపీ మైనార్టీ నాయకులు అజాంను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జాషువా, చంద్రమౌళి, ఆంజనేయులు బ్రదర్స్, చెన్నకృష్ణారెడ్డి, రెడ్డి కుమార్, భాస్కర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, అజాం, రామసుబ్బయ్య, లోకేష్, సుధాకర్, ధనుంజయ, మల్లికార్జున, నాగరాజు పాల్గొన్నారు.

నేడు సంజీవరాయస్వామి పొంగళ్లు

పుల్లంపేట : మండలంలోని తిప్పాయిపల్లిలో కొలువైన సంజీవరాయ స్వామి పొంగళ్ల కార్యక్రమం ఆదివారం జరుపుతున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. పురుషులు మాత్రమే ఈ పొంగళ్లు పెట్టడం అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. ముందురోజు రాత్రి నుంచే గ్రామంలో కోలాటం, చెక్క భజన కార్యక్రమాలుంటాయని వారు తెలిపారు.

లక్ష్మీ వేంకటేశ్వరాలయంలో పూజలు

సంబేపల్లి : మండలంలోని అడవికమ్మపల్లెలో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని శుద్ధిచేసి వివిధ రకాల పుష్పాలతో స్వామిని అలంకరించారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

నేడు ప్రతిష్టా ద్వాదశి..

రామాపురం : విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య భవ్య రామ మందిరంలో బాలరాముడి ప్రతిష్ట జరిగి ఏడాది అయినందున ఆదివారం ప్రతిష్టా ద్వాదశి నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ నాయకుడు వీరారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి కార్యకర్తలు రావాలని ఆయన కోరారు.

నల్ల గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

సుండుపల్లె : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నల్ల గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు, బంగారు ఆభరణాలతో అలంకరించి ప్రాణ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆలయాన్ని విద్యుద్దీపాలు, చాందినీబండ్లు అలంకరించి ఊరేగించారు. నలమూలల నుంచి భక్తులు పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు ఆర్థికసాయం

రామాపురం : మెడిసిన్, ఇంజినీరింగ్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు టివి.సత్యమయ్య తెలిపారు. స్థానిక నీలకంఠ్రావుపేటలోని సద్గురు దర్గా మాతాజీ గంగిశెట్టి రంగనాయకమ్మ ఎడ్యుకేషనల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏడాదికి రూ.10వేల చొప్పున నాలుగేళ్లకు ఆర్థికసాయం చేస్తారన్నారు. ఈ నెల 20న ర్యాంకు కార్డు, అడ్మిషన్ స్లిప్, ఆధార్‌కార్డుతో రావాలని, మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 94414 02901కు సంప్రదించాలని తెలియజేశారు.

మహా విష్ణువు కల్యాణం




కల్యాణోత్సవంలో వేద పండితులు, భక్తులు

రామాపురం : మండలంలోని కంభరాయుడిగుట్టపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువు ఆలయంలో స్వామి వారి కల్యాణ వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య కమనీయంగా సాగింది. అనంతరం మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసనం, మహా కుంబాభిషేకం, రుద్రాభిషేకం, పుష్కరిణిలో సుదర్శన చక్ర తళ్వార్, చక్రస్నానం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు ముక్కోటి బసిరెడ్డి, రామాంజుల్‌రెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి సతీసమేతంగా వచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఫిబ్రవరి 6 నుంచి ఏఐవైఎఫ్ మహాసభలు


రైల్వేకోడూరు అర్బన్ : ఫ్రిబ్రవరి 6, 7, 8, 9వ తేదీలలో ఏఐవైఎఫ్ మహాసభలను శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దార్లరాజశేఖర్, వెంకటేష్, సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్నయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు కార్మికులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాఫర్, హరి, కుమార్, నరశయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా చంద్రానాయక్



సుండుపల్లె : వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎంపీటీసీ చంద్రనాయక్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఇంటెలెక్చ్యువల్ ఫోరమ్ అధ్యక్షుడిగా..




నాయబ్‌రసూల్

సిద్ధవటం : మండలంలోని మాధవరం-1 గ్రామానికి చెందిన షేక్ నాయబ్ రసూల్‌ను అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ ఇంటెలెక్చ్యువల్ ఫోరమ్ అధ్యక్షుడిగా నియమిస్తూ వైఎస్ఆర్‌సీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రసూల్ సంతోషం వ్యక్తం చేశారు.

శిల్పకళల ఊరు.. నందలూరు..



సౌమ్యనాథస్వామి ఆలయం



బౌద్ధ రామాలు



ఐఏఎస్‌లను అందించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నందలూరు : శిల్ప కళలకు నిలయమైన నందలూరులో ఒక వైపు సౌమ్యనాథ స్వామి కరుణా కటాక్షం.. మరో వైపు రైళ్ల వేగం ఇట్టే కనిపిస్తాయి. అంతేకాదు.. ఇక్కడ 1908లో ప్రారంభించిన జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్య అభ్యసించి ఎందరో ఐఏఎస్‌లుగా ఎదిగిన చరిత్ర నందలూరుకు ఉంది.

అన్నమయ్య కీర్తనల నిలయం

పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు కీర్తనలలో కనిపించే సౌమ్యనాథ స్వామి ఆలయం నందలూరులో ఉంది. తిరుమల వేంకటేశ్వరస్వామి ఈ ఆలయంలోనే కూర్చొని శృంగార కీర్తనలు రచించినట్లు ఆధారాలు ఉన్నాయి. నారదమునిచే ఆలయంలో సౌమ్యనాథస్వామి విగ్రహం ప్రతిష్ఠించబడినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. చోళుల శిల్పకళా నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన ఈ ఆలయం పది ఎకరాల విస్తీర్ణంలో 108 స్థంబాలతో విస్తరించింది. స్వామిని దర్శించుకొని తొమ్మిది ప్రదక్షణలు చేస్తే కోర్కెలు నెరవేరుతాయని భక్తుల అపార నమ్మకం. వారి కోరిక నెరవేరగానే స్వామిని దర్శించుకొని 108 ప్రదక్షణలు చేస్తారని ఇక్కడి భక్తుల విశ్వాసం.

బౌద్ధారామాలు కూడా..

క్రీస్తు పూర్వం 3వ శతాబ్దం నుంచి 11వ శతాబ్దం మధ్య నందలూరు బహుదానది ఒడ్డున ఆడపూరు వద్ద ముక్తి కనుమపై బౌద్ధరామాలు విరాజిల్లుతాయని దక్షిణ భారతదేశ పర్యటన చేసిన చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ ప్రపంచానికి తెలియజేశారు. 1977లో అప్పటి రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు జరపగా.. 1978లో ముక్తి కనుమపై 21 స్థూపాలు బయటపడ్డాయి. సరైన ప్రచారాలు నిర్వహించకపోవడంతో బౌద్ధరామాలకు ఆదరణ లభించలేదు. రాయలసీమలో అరుదుగా ఉన్న బౌద్ధారామాలను మరింత అభివృద్ధి పరచాల్సిన బాధ్యత రాష్ట్ర పర్యాటకశాఖపై ఉంది.

ప్రాభవం కోల్పోతున్న రైల్వే

బ్రిటీష్ కాలం నుండి వెలుగు వెలిగిన నందలూరు రైల్వే కేంద్రం నేడు తన ప్రభావాన్ని కోల్పోతోంది. దాదాపు 1000 మందికి పైగా ఉద్యోగులు, వందలాది రైల్వే క్వార్టర్స్‌తో కళకళలాడిన నందలూరు నేడు బోసిపోయింది. లోకో షెడ్ మూతపడటంతో ఇక్కడి కార్యాలయాలు ఒక్కొక్కటిగా తరలిపోయాయి. కరోనా తరువాత రైళ్లకు ఇక్కడ స్టాపింగ్ ఎత్తివేశారు. 150 ఎకరాల విస్తీర్ణంలో కేంద్రీకృతమైన నందలూరు రైల్వే కేంద్రంలో పుష్కలంగా మౌలిక వసతులు ఉన్నా.. అధికారులు వినియోగించుకోలేదు. ఏదో ఒక పరిశ్రమ ఏర్పాటు చేసి అభివృద్ధి పరిస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.